క్లుప్తంగా

శంషాబాద్ మున్సిపాలిటీ బడ్జెట్ రూ.97 కోట్లు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం శుక్రవారం జరిగింది. మొత్తం 97 కోట్ల బడ్జెట్‌ను పాలక వర్గం ఆమోదించింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ, పట్టణ పురోభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. అభివృద్ధిలో శంషాబాద్ పట్టణం ఆదర్శవంతంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా మొత్తం 97 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కమిషనర్ భోగీశ్వర్లు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’లో భాగస్వాములు కావాలి



ర్యాలీలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు

బండ్లగూడ: ప్రజలంతా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా స్వచ్ఛ మషాల్ మార్చ్‌ను కాళీమందిర్ నుంచి పీరంచెరువు వరకు నిర్వహించారు. ర్యాలీలో పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛ బండ్లగూడ జాగీరుగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఇంట్లో తడి, చెత్త పొడి చెత్తను వేరే చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన నిర్మూలన, ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, పూర్తిస్థాయిలో చేసేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, మహిళలు ప్రతిజ్ఞ చేశారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

చార్మినార్: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ అన్నారు. రంజాన్ మాసంలో మక్కా మసీదు, చార్మినార్ పరిసరాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మక్కా మసీదు–చార్మినార్ రోడ్డులోని గ్రానైట్ రోడ్లను వాటర్ ట్యాంక్‌లతో శుభ్రం చేస్తున్నామని, దుమ్ము, ధూళీ లేకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సామూహిక ప్రార్థనలు, ఇఫ్తార్ విందుల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రంజాన్ మాసంలో ముస్లింలు తరావీ ప్రార్థనలు చేయాలి

శాలిబండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తరావీ ప్రార్థనలు చేయాలని, మౌలానా సయ్యద్ షా మీర్జా నజీముద్దీన్ ఖాద్రీ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో రెండో శుక్రవారం సందర్భంగా ఆలిండియా సున్నీ ఉల్మా బోర్డు ఆధ్వర్యంలో జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని సూచించారు. రంజాన్ మాసంలో ఖురాన్ చదివితే పుణ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో మౌలానా హమీదుద్దీన్ షుత్తారీ పాల్గొన్నారు.

‘ఉద్యమకారులకు సీఎం న్యాయం చేస్తున్నారు’



అబిడ్స్: నూతన ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తెలంగాణ ఉద్యమ నాయకుడు దేశపతి శ్రీనివాస్‌ను రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకుడు మాచర్ల దినకర్ సత్కరించారు. శుక్రవారం ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో దేశపతి శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారన్నారు. ఉద్యమకారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయం చేస్తున్నారన్నారు. బోడంపాటి సత్యనారాయణగౌడ్, రత్నదీప్ పాల్గొన్నారు.

గోమాతకు పూజలు

గోల్కొండ: సీతారాముల కల్యాణం, శ్రీరామ శోభాయాత్రలు విజయవంతం కావడం శ్రీరాముడిపై ప్రజలకు ఉన్న భక్తిని చాటిచెబుతున్నాయని కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ టి.అమర్ సింగ్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఆయన గోమాతకు పూజలు నిర్వహించారు.

తీరు మార్చుకోరా..?

- ఊర చెరువును కబ్జా చేసేందుకు అక్రమార్కుల ప్రయత్నాలు
- ఇప్పటికే ఏడు సార్లు నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు
- తాజాగా మరోసారి నిర్మాణాలు చేపడుతున్న వైనం
- కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు


చెరువును పూడ్చి రోడ్డు వేయడంతో పాటు నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

రాజేంద్రనగర్: గతంలో కొందరు అనేక సార్లు ఊర చెరువును కబ్జాకు చేసేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకుని నిర్మాణాలను తొలగించారు. ఇలా ఏకంగా ఏడు సార్లు అడ్డుకున్నప్పటికీ కబ్జాదారులు మాత్రం తీరు మార్చుకోవడం లేదు. రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి ఊర చెరువు సమీపంలో కాలనీలు, బస్తీలు వెలిశాయి. అక్కడ ఈ చెరువు స్థలం మాత్రమే ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఎఫ్‌టీఎల్‌తో పాటు చెరువును కబ్జాదారులు క్రమంగా పూడ్చివేస్తూ నిర్మాణాలను చేపడుతున్నారు. గతంలో లేఅవుట్ వేసి ప్లాట్లను విక్రయించడంతో యజమానులు నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కబ్జాదారులను అడ్డుకొని అక్కడ వేసిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను తొలగించారు. గతంలో ఇలా ఏడు సార్లు జరగ్గా, ప్రస్తుతం మరోసారి రోడ్లు వేసి నిర్మాణాలు చేపట్టేందుకు కొందరు ముందుకు వచ్చారు. ఈ విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కబ్జా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు..

శివరాంపల్లి ప్రాంతంలో ప్రస్తుతం ఖాళీ స్థలం లేదు. చెరువును పూడ్చి ప్లాట్లు వేశారు. ఇక్కడ గజం రూ.50 వేల వరకు ధర పలుకుతోంది. దీంతో చెరువును కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన ఈ చెరువులో ఇప్పటికే కొన్ని నిర్మాణాలు వెలిశాయి. దీనిని ఆసరాగా చేసుకొని వాటి పక్కనే మరికొన్ని నిర్మాణాలను ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్థలం బహిరంగ మార్కెట్‌లో వంద కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

వర్షం వస్తే కాలనీలు జలమయం..

శివరాంపల్లి, రాజేంద్రనగర్, గగన్‌పహాడ్ ప్రాంతంలో గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతం మొత్తం పంట పొలాలు, చెరువులు, కాలువలతో ఉండేది. ఊర చెరువు సైతం గొలుసుకట్టు చెరువే. ఈ చెరువుపై ఉన్న చిలాన్‌చెరువు నిండి ఇందులోకి నీళ్లు వచ్చేవి. ఈ చెరువు నిండిన అనంతరం దిగువ ఉన్న బమ్రుక్‌దోలా తదితర చెరువుల్లోకి నీరు వెళ్లేది. ప్రస్తుతం వరద నీరు ఈ చెరువులోకి వచ్చేందుకు మార్గం లేకపోవడంతో బస్తీలు, కాలనీలను వరద ముంచెత్తుతోంది. భారీ వర్షం కురిస్తే ప్రతి సంవత్సరం సమీపంలో ఉన్న కాలనీలు మునిగిపోతున్నాయి. ఈ చెరువులో పూడిక తీసి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

చెరువు స్థలంలో ప్లాట్లు వేసి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణాలను అడ్డుకోవడం, అనంతరం తిరిగి ప్రారంభించడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసులు నమోదు చేస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్‌తో పాటు చెరువు స్థలం సగం వరకు కబ్జాకు గురైందని, అధికారులు స్పందించి మిగిలిన చెరువునైనా పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


పనులను పరిశీలిస్తున్న సాబాద విజయ్‌కుమార్

రాజేంద్రనగర్: ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ, జనప్రియ, పాండురంగానగర్ ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం ప్యాచ్‌వర్క్ చేపట్టారు. ఈ పనులను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా రోడ్లు గోతులమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, దీంతో బీటీ మిశ్రమం ద్వారా రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సాయియాదవ్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ నేతలు కబ్జాలను ప్రోత్సహిస్తున్నారు’


సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌గౌడ్

శంషాబాద్: ప్రభుత్వ భూముల కబ్జాలను ప్రోత్సహిస్తున్న బీఆర్‌ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల హెచ్‌ఎండీఏకు చెందిన యాభై ఎకరాల స్థలాన్ని అన్యాక్రాంతం చేయడం వెనక బీఆర్‌ఎస్ నేతలు ఉన్న సంగతి ప్రభుత్వానికి తెలియదా అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.500 కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతమైన విషయంలో మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర ఏంటో తేల్చాలన్నారు. హెచ్‌ఎండీఏ స్థలానికి ఇంటి నంబరు ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్‌లు చేస్తూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తే కబ్జా వెనకున్న పాత్రదారులు బయటపడడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, మల్లేష్‌యాదవ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్‌ను పొడిగించాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆల్‌కాలనీస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ వరకు రూ.9.80 కోట్లతో చేపడుతున్న బాక్స్ డ్రైన్ పనులను ఎంప్లాయీస్ కాలనీ వరకు పొడిగించాలని మణికొండ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. శుక్రవారం ఆయనను కలిసి పండెన్ వాగు నీటితో దుర్గంధం వెదజల్లుతోందని, పక్కన నివసించే వారికి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. దానిపై కప్పు వేస్తే రోడ్డుగా సైతం ఉపయోగపడుతుందని కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం, కోశాధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

వైఎస్‌ఆర్‌టీపీ నేత శ్రీనివాస్‌రెడ్డి


ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద రాజేంద్రనగర్ వైఎస్ ఆర్‌టీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సదాల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడికి రాజేంద్రనగర్ వైఎస్‌ఆర్‌టీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సదాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా శివరాంపల్లిలోని కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుకుందని విమర్శించారు. తినేందుకు తిండి సైతం లేక ఎందరో నిరుద్యోగులు అప్పులు చేసి కోచింగ్‌లకు వెళ్లి పరీక్షలు రాశారని, పేపర్ లీకేజీ చేసి వారి ఆశలపై నీళ్లు చల్లారన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలపడిన తమను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. అరెస్టులతో తమ ఉద్యమం ఆగదని గుర్తు చేశారు.

‘స్వచ్ఛభారత్’పై అవగాహన కల్పించిన విద్యార్థులు



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న మహావీర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

రాజేంద్రనగర్: మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 3వ రోజు మహేశ్వరంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులకు పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ స్థలం కబ్జా యత్నం ఘటనలో ఇద్దరిపై కేసు

రాజేంద్రనగర్: శాస్త్రీపురంలోని జీహెచ్‌ఎంసీ పార్కు స్థలం కబ్జా యత్నం ఘటనపై రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, శాస్త్రీపురం వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పార్కు ప్రహరీని ధ్వంసం చేసి కబ్జాకు ప్రయత్నించారంటూ టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం కొందరు పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారు. నిందితుల్లో ఫలక్‌నూమాకు చెందిన సజ్జిద్, శాలిబండాకు చెందిన అసద్‌లను గుర్తించి పట్టుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. అయితే, అది ప్రైవేటు స్థలం అని, తమ వద్ద దస్తావేజులు ఉన్నాయని వారు చెప్పారని ఇన్‌స్పెక్టర్ మధు తెలిపారు. దస్తావేజులను తీసుకురావాలని తెలిపామని, వాటిని పరిశీలించిన అనంతరం అందుకు అనుగుణంగా కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రహరీ నిర్మించాలి: స్థానికులు.

శాస్త్రీపురం పార్కు ప్రహరీని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పునర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. స్థలాన్ని మరోసారి కబ్జా చేయకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. పార్కు స్థలం చుట్టు బోర్డులు ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్కును ఆధునీకరించాలని కోరుతున్నారు.

6న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

గచ్చిబౌలి: నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్న లైట్ హౌస్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏప్రిల్ 6న ప్రారంభించనున్నారు. చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఎదురుగా జీహెచ్‌ఎంసీ నిర్మించిన భవనంలో ఇక నుంచి శిక్షణ ఇస్తారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత, వెస్ట్ జోనల్ కమిషనర్ ఎస్.శంకరయ్య, చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుదాంష్ తదితరులు పాల్గొంటారు.

గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి


కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు

మణికొండ: గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే ఆరోగ్యంగా ఉండే బిడ్డలకు జన్మనిస్తారని, అందుకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని నార్సింగి కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. శుక్రవారం నార్సింగిలో లక్ష్మమ్మ ఆలయ ఆవరణలో అయ్యప్ప భవన్‌లో గర్భిణులకు అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన, వెల్‌బేబీ షో, ప్రైమరీ స్కూల్ పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం తినడంతో పాటు కాల్షియం ట్యాబ్లెట్లు వాడాలని, తరచూ ఆసుపత్రిలో చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీడీఓ లక్ష్మీబాయి, సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, సులోచన, అన్నపూర్ణ, సుకన్య, జ్యోతి, ఉష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరో కౌన్సిలర్ లక్ష్మీ ప్రవల్లిక ఉగ్గు గిన్నెలు, 18వ వార్డు కౌన్సిలర్ నరేష్ టిఫిన్ బాక్సులు అందజేశారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో వీధులను సైతం అలాగే పరిశుభ్రంగా ఉంచుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వార్డు పరిధిలోని డ్వాక్రా మహిళలతో స్వచ్ఛ మషాల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డును పరిశుభ్రంగా ఉంచాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, శానిటేషన్ సూపర్‌వైజర్ మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాంప్‌కు బదులు చెప్పు అమర్చారు!

- షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోతున్న గృహోపకరణాలు
- వీధి దీపాలు కాలిపోవడంతో అంధకారం
- అవస్థలు పడుతున్న కేశవనగర్‌వాసులు


కేబుల్ వైర్లు అనుసంధానం వద్ద షార్ట్ సర్క్యూట్ కాకుండా రబ్బర్ చెప్పును అమర్చిన దృశ్యం

రాజేంద్రనగర్: విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అత్తాపూర్ డివిజన్ కేశవనగర్ కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని ఉపకరణాలు కాలిపోగా, ప్రస్తుతం వీధి దీపాలు పూర్తిగా కాలిపోయాయని వాపోతున్నారు. ప్రతి నెలా ఇంటింటికీ తిరుగుతూ బిల్లు వసూలు చేస్తున్న సిబ్బంది, తమ కాలనీలోని సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ కాలనీలో గతంలో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లు బిగించారు. కాలనీలోని ఓ స్తంభానికి కేబుల్ కనెక్షన్‌ను విద్యుత్ వైర్‌తో అనుసంధానం చేశారు. ఈ రెండు వైర్లు కలిసే చోట క్లాంప్ పిన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, రబ్బర్ చెప్పును అమర్చారు. ఈ క్లాంప్‌పై అనుసంధానం చేసిన వైరును బిగించడంతో ఈదురు గాలులు వచ్చిన సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతోంది. మూడు నెలల క్రితం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇళ్లల్లోని టీవీలు, ఫ్రీజ్‌లు కాలిపోయాయి. ఆ సమయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పూర్తిస్థాయిలో పనులు నిర్వహించకుండా మరోసారి అదే రబ్బర్ చెప్పును బిగించి చేతులు దులుపుకున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. చెప్పు అమర్చిన చోట మరోసారి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కాలనీలోని వీధి దీపాలన్నీ కాలిపోయాయని, దీంతో కాలనీలో రాత్రిపూట అంధకారం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తే కాలనీలోని 35 వీధి దీపాల మరమ్మతులు ఇప్పుడు సాధ్యం కాదని, కొత్త బల్బులు లేవని చెబుతున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

‘జనచైతన్య’కు రోడ్డు వేయండి


మున్సిపల్ కమిషనర్‌ను వినతిపత్రం ఇస్తున్న ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని జనచైతన్య లేఅవుట్‌కు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రోడ్డును నిర్మించాలని ప్లాట్ ఓనర్స్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్ పక్కన ఉన్న జనచైతన్య లేఅవుట్‌కు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవటంతో అక్కడ నివాసం ఉండే వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు. దాంతో కమిషనర్ స్పందించి త్వరలోనే రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు టీఎస్ రెడ్డి, వంశీకృష్ణ, డాక్టర్ రాంమోహన్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలి

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలో నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మజ్లిస్ పార్టీలో పదవులు అలంకార ప్రాయం కావని, కష్టపడి పని చేసే వారికే పదవులు వస్తాయన్నారు. పదవులను నిలబెట్టుకోవాలంటే నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, అలీమొద్దీన్, సయ్యద్ అబ్బాస్ హుస్సేన్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

రాజేంద్రనగర్: వివిధ కేసుల్లో పట్టుబడిన వారిలో ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్ షా తీర్పునిచ్చారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 16 మందిపై చార్జ్‌షీట్ నమోదు చేశారు. వీరికి శుక్రవారం రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్ షా ముందు హాజరుపర్చగా వారికి రూ.57,950 జరిమానా విధించారు. వారిలో ఐదు మందికి జైలు శిక్ష విధించారు. నలుగురికి రెండు రోజుల చొప్పున, ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున, ముగ్గురికి మూడు రోజుల చొప్పున శిక్ష విధించారు.

వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు


నూతన బస్సు, అంబెలెన్స్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ తెలిపారు. గచ్చిబౌలి లోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన 50 సీట్లతోకూడిన బస్సును, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పనిచేసే అధికార యంత్రాంగం, సిబ్బందితోపాటు విద్యార్థులందరికీ వీటి వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంద న్నారు.

తరుణ్‌చుగ్‌ను కలిసిన దేవర శ్రీనివాస్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడం ఖాయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ శుక్రవారం తరుణ్‌చుగ్‌తో పాటు బండి సంజయ్‌ను కలిశారు. ఆయన గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ కుమారుడు దేవర వంశీని తరుణ్‌చుగ్‌కు పరిచయం చేశారు. మొదటి ప్రజాసంగ్రామ యాత్రలో భోజన విభాగానికి దేవర శ్రీనివాస్ సమర్థవంతంగా సేవలు అందించారని శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట శ్రీకాంత్ సాగర్, అశ్విన్, ప్రభు తదితరులు ఉన్నారు.